క్లుప్తంగా

ఓటరు సర్వే పారదర్శకంగా జరగాలి



ఓటరు సర్వేపై చర్చిస్తున్న వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు

మునగపాక : ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూసుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. శనివారం మండలంలోని వాడ్రాపల్లి సచివాలయంలో ఓటరు సర్వేకు సంబంధించి గ్రామంలోని పలు రాజకీయ నాయకులతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు సర్వే పారదర్శకంగా చేపట్టాలన్నారు. జాబితాలో సవరణలపై దృష్టి సారించాలన్నారు. కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలన్నారు. గడువులోగా సర్వే పూర్తయ్యేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని నూకరాజు కోరారు.

సకాలంలో టీకాలు వేయాలి



దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారితో మాట్లాడుతున్న డాక్టర్ మురళీధర్

రాంబిల్లి : జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ వై.మురళీధర్ శనివారం దిమిలి పీహెచ్‌సీని సందర్శించారు. దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్.వెంకటేష్‌తో టీకాల ప్రక్రియపై చర్చించారు. దిమిలి పీహెచ్‌సీలో ప్రసవములు జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు వైద్య సిబ్బంది తగిన అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్.ఎస్.వి.ఎస్ రాజు, ఆరోగ్య పర్యవేక్షకులు సీహెచ్ ధనరాజ్, ఉమా మహేశ్వరి పాల్గొన్నారు.

పిల్లి అప్పారావుకు పరామర్శ



వైఎస్సార్‌సీపీ నేత అప్పారావు తండ్రి వెంకన్నకు నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : వైఎస్సార్‌సీపీ నేత పిల్లి అప్పారావు తండ్రి వెంకన్న చిత్రపటానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ నివాళులర్పించారు. దళితవాడకు చెందిన అప్పారావు తండ్రి వెంకన్న ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. శనివారం వెంకన్నకు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ వెంకన్న మృతి బాధాకరమన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రసాద్ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

నూకాంబిక గుడికి ద్వారబంధం ఏర్పాటు



నూకాంబిక అమ్మవారి గుడికి ద్వారబంధం ఏర్పాటు చేసిన దృశ్యం

మునగపాక : తిమ్మరాజుపేట అంబేడ్కర్ కాలనీలో శనివారం నూకాంబిక అమ్మవారి ఆలయ ద్వారబంధం ఏర్పాటు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, సమరసత సేవా ఫౌండేషన్ వారి ఆర్థిక సహకారంతో ఆలయ నిర్మాణం చేపట్టారు. సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కృష్ణారావు, ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, పంచాయతీ పాలకవర్గ సభ్యులతో పాటు గ్రామస్తులు పెద్దసంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే దివంగత కృష్ణమూర్తిరాజు సతీమణి మృతి



వెంకట సుభద్రయ్యమ్మ(ఫైల్)

కోటవురట్ల: మాజీ ఎమ్మెల్యే దివంగత రాజాసాగి కృష్ణమూర్తిరాజు సతీమణి వెంకట సుభద్రయ్యమ్మ శనివారం మృతి చెందారు. ఆమె మృతికి పలువురు సంతాపం తెలిపారు. మండలంలోని తంగేడులోని ఆమె నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సీతారామరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ రామచంద్రరాజు, సత్యనారాయణరాజు, లక్ష్మీనరసింహరాజు, పలువురు ప్రజా ప్రతినిధులు కృష్ణమూర్తిరాజు తనయుడు పెద సీతబాబును పరామర్శించారు.

వార్డుల్లో ఫ్యాన్ గాలి

- ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల జయకేతనం
- టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులు చిత్తు

మునగపాక : మండలంలోని మెలిపాక పంచాయతీ వార్డు సభ్యుని ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు గుల్ల అమర వెంకట సత్యనారాయణ 22 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈ ఎన్నికను వైఎస్సార్‌సీపీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. 184 ఓట్లకు గాను 154 ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సత్యనారాయణకు 86 ఓట్లు అలాగే టీడీపీ మద్దతు అభ్యర్థి లోవరాజుకు 64 ఓట్లు, జనసేన మద్దతు అభ్యర్థి నందికోళ్ల రాముకు 4 ఓట్లు పోలయ్యాయి. దీంతో 22 ఓట్ల మెజార్టీతో అమర వెంకట సత్యనారాయణ విజయం సాధించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రసాద్ తెలిపారు.

టీడీపీ కంచుకోటకు బీటలు..

కొన్నేళ్లుగా మెలిపాక పంచాయతీలో టీడీపీ ఆధిక్యం కొనసాగుతూ వచ్చేది. గతంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అయినంపూడి విజయభాస్కరరాజు వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసి టీడీపీ కంచుకోటను బద్దలు గొట్టి విజయం సాధించారు. అదే ఊపును పంచాయతీ వార్డు ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ కొనసాగించడం పట్ల హర్షాతిరేకాలు వినిపిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ మద్దతు దారు సత్యనారాయణ వార్డు సభ్యునిగా విజయం సాధించడంతో పార్టీ శ్రేణులు సందడి చేశారు.

శ్రీరామపురం 8వ వార్డులో..

పాయకరావుపేట : శ్రీరాంపురం గ్రామ పంచాయతీ సభ్యుడికి శనివారం జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు మేడిశెట్టి నూకరాజు గెలుపొందారు. గ్రామ పంచాయతీ 8వ వార్డు (బీసీ కేటగిరి)లో మేడిశెట్టి నూకరాజు, బత్తిన నాగేశ్వరరావు పోటీ పడగా వార్డులో 261 ఓట్లకు 184 ఓట్లు పోలయ్యాయి. వీటిలో 10 ఓట్లు చెల్లనివి. బత్తిన నాగేశ్వరావుకు 84 ఓట్లు రాగా, మేడిశెట్టి నూకరాజుకు 90 ఓట్లు వచ్చాయి. 6 ఓట్ల మెజార్టీతో మేడిశెట్టి నూకరాజు గెలుపొందినట్టు ఆర్‌ఓ దీపిక తెలిపారు. నూకరాజుకు ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందించి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పీవో డి.సత్యనారాయణ, ఓపీవో ఎం.రామకోటి, ఎంపీడీవో ఎ.సాంబశివరావు, ఈఓఆర్‌డీ వై.సత్యనారాయణ పాల్గొన్నారు. సీఐ పి.అప్పలరాజు పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఎన్నికల అధికారి ప్రసాద్ నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న వార్డు సభ్యుడు సత్యనారాయణ

ప్రశాంతంగా పోలింగ్

మునగపాక : మండలంలోని మెలిపాక వార్డు సభ్యుని ఉప ఎన్నిక శనివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం నుంచి తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. వార్డు సభ్యుని పదవికి ముగ్గురు అభ్యర్థులు పోటీలో నిలిచారు. మొత్తం 184 ఓట్లకు గాను 154 ఓట్లు పోలైనట్టు ఎన్నికల అధికారి ప్రసాద్ తెలిపారు. కాగా పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ మహమ్మద్ ఆలీ షరీఫ్ తగు బందోబస్తు నిర్వహించారు. కాగా పోలింగ్ కేంద్రాన్ని పరవాడ డీఎస్పీ సత్యనారాయణ, యలమంచిలి సీఐ గఫూర్‌లు సందర్శించారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నేతలు తమకు అవకాశం కల్పించాలంటూ ఓటర్లను ప్రసన్నం చేసుకున్నారు.

కొరుప్రోలు సర్పంచ్‌గా సూరివేణి

ఎస్.రాయవరం : కొరుప్రోలు సర్పంచ్ ఉప ఎన్నికలో కర్రి సూరివేణి స్వల్ప మెజార్టీతో విజయం సాధించారు. గ్రామంలో శనివారం ఉదయం 7 గంటల నుంచి నిర్వహించిన పోలింగ్‌లో 3283 ఓట్లకు గాను 2420 ఓట్లు పోలయ్యాయి. మధ్యాహ్నం 3 గంటలకు లెక్కింపు ప్రక్రియ ప్రారంభమై ఫలితాలు ఎన్నికల అధికారి వెంకట నారాయణ విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పోలవరపు హేమపై టీడీపీ మద్దతు అభ్యర్థి కర్రి సూరివేణి 163 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. ఎన్నిక ప్రక్రియను నర్సీపట్నం ఏఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా, అడిషనల్ ఎస్పీ (క్రైం) పి.సత్యనారాయణతో నక్కపల్లి సీఐ అప్పన్న పర్యవేక్షించారు. ఎస్‌ఐ ప్రసాద్‌రావు గట్టి బందోబస్తు నిర్వహించారు. లింగరాజుపాలెంలో శనివారం నిర్వహించిన 5వ వార్డు మెంబర్ ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ మద్దతుదారు అభ్యర్థిపై టీడీపీ మద్దతుదారు అయిన నాగనూకగొరి 11 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్టు ఎన్నికల అధికారి ప్రసాద్‌రాజు తెలిపారు. చినగుమ్ములూరులో 5వ వార్డు మెంబర్ అభ్యర్థి కాకర శివశంకర్ ఏకగ్రీవం కాగా, గుడివాడ 10 వ వార్డు మెంబర్ వైఎస్సార్‌సీపీ మద్దతుదారు దూళి అరుణ్ కుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



నూకరాజుకు ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఆర్ఓ దీపిక

ఒక వార్డు ఏకగ్రీవం.. మరోవార్డులో హోరాహోరీ

నక్కపల్లి: స్థానిక ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు దారులు విజయం సాధించారు. మండలంలో చినదొడ్డిగల్లు ఒకటోవార్డుకు, రేబాకలో పదో వార్డుకు ఉప ఎన్నికలు జరిగాయి. రేబాక నుంచి వైఎస్సార్‌సీపీ సర్పంచ్ సాదిరెడ్డి శ్రీను బలపరచిన సాదిరెడ్డి బుజ్జమ్మ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, శనివారం హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో చినదొడ్డిగల్లు ఒకటో వార్డు నుంచి నాయుడు నానాజీ ఒక్క ఓటు మెజార్టీతో టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడిగా బలపరచిన అభ్యర్థి ఈశ్వరరావుపై విజయం సాధించారు. నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులను ఏపీఎఫ్‌యూడీసీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు కాసులమ్మ వైస్ ఎంపీపీలు ఈశ్వరరావు, నానాజీ, సర్పంచ్ చంద్రరావు, శ్రీను, పీఏసీఎస్ అధ్యక్షుడు మణిరాజు, స్కూల్ కమిటీ చైర్మన్ లక్ష్మణరావు అభినందించారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ, సీఐ గఫూర్

దిబ్బపాలెం 4వ వార్డులో..

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలోని దిబ్బపాలెం నాలుగో వార్డులో శనివారం జరిగిన ఎన్నికలో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి ఘన విజయం సాధించాడు. ఈ వార్డులో 456 ఓట్లకు 368 ఓట్లు పోలయ్యాయి. 80.92 శాతం ఓట్ల శాతం నమోదైంది. వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేసిన పోలవరపు చిట్టిబాబు, తన ప్రత్యర్థి టీడీపీకి చెందిన కసిరెడ్డి జయలక్ష్మిపై 109 ఓట్ల మెజారిటీ సాధించారు. చిట్టిబాబుకు 238 ఓట్లు, విజయలక్ష్మికి 129 ఓట్లు లభించాయి. కొద్ది నెలల క్రితం ఇక్కడ జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గెలవడంతో ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలుస్తామని టీడీపీ, జనసేన కలిసి ప్రచారం చేసినా ఓటరు తీర్పు ముందు చేతులెత్తేశారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ మురళీరావు, ఎస్‌ఐ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా పరవాడ ఈవోఆర్‌డీ పద్మజ వ్యవహరించారు.



గెలుపు ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి పోలవరపు చిట్టిబాబు (అచ్యుతాపురం మండలం దిబ్బపాలెం నాల్గవ వార్డు)



కొరుప్రోలు సర్పంచ్‌గా ఎన్నికైన కర్రి సూరివేణికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి



ఏకగ్రీవంగా ఎన్నికైన రేబాక వార్డు సభ్యురాలు బుజ్జమ్మకు ధ్రువపత్రం ఇస్తున్న దృశ్యం



చినదొడ్డిగల్లు వార్డు సభ్యుడిగా గెలుపొందిన నానాజీకి ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి



దిబ్బపాలెం పోలింగ్ కేంద్రం వద్ద క్యూలైన్‌లో ఓటర్లు

యంత్ర సాయంతో వరినాట్లు



మామిడివాడలో యంత్ర సాయంతో వరినాట్లు

రాంబిల్లి: యంత్ర సాయంతో వరినాట్లు వేయడం ద్వారా ఖర్చు తగ్గి సమయం ఆదా అవుతుందని ఏవో సి. సుమంత అన్నారు. శనివారం మామిడివాడలో పి. సూర్యనారాయణ యంత్ర సాయంతో వరినాట్లు వేశారు. ఈ ప్రక్రియను ఏవో సుమంత పరిశీలించారు. యంత్ర సాయంతో వరినాట్లు వేసేందుకు రూ.4వేలు ఖర్చు అవుతుందని, 15 కేజీలు విత్తనం సరిపోతుందన్నారు. కూలీల సమస్యను అధిగమించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సంతోషి, ఎంపీఈవో రామారావు, వీఏఏ ప్రశాంతి పాల్గొన్నారు.

ఉత్తమ పురస్కార గ్రహీతలకు సత్కారం



ఉత్తమ పురస్కార గ్రహీతలను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

మునగపాక : స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా జిల్లాస్థాయిలో ఉత్తమ పురస్కారాలు అందుకున్న గ్రహీతలకు శనివారం రాత్రి మునగపాక అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో ఘన సత్కారం నిర్వహించారు. మునగపాక గ్రామానికి చెందిన ముగ్గురు ఉద్యోగులు ఉత్తమ పురస్కారాలు అందుకున్న నేపథ్యంలో వారిని సత్కరించారు. కశింకోట హౌసింగ్ ఏఈ వెలగా శ్రీనివాసరావు, అచ్యుతాపురం పీహెచ్‌సీ ల్యాబ్ టెక్నీషియన్ జల్లేపల్లి గీతారాణి, ఉపాధిహామీ పథకం మునగపాక గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ దొడ్డి గోవింద, రాష్ట్రస్థాయిలో ఉత్తమ పీఏసీఎస్‌గా పురస్కారం అందుకున్న నేపథ్యంలో పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావులకు అయ్యప్ప స్వామి కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. వేగి లక్ష్మణరావు, మళ్ల సంజీవరావు,ఆడారి అచ్చియ్యనాయుడు,మొల్లేటి సత్యనారాయణ,పెంటకోట జగన్నాథరావు, వేగి వీరునాయుడు,కాండ్రేగుల జగ్గారావు,కిరణ్,ఉత్సవకమిటీ చైర్మన్ బొడ్డేడ అప్పలనాయుడు, వార్డు సభ్యుడు దాడి పోలీసు చిన్న, వెంకట్, పెంటకోట శ్రీను కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంతిమ యాత్రకు వాహన సదుపాయం

యలమంచిలి : పట్టణ ప్రజలకు అంతిమ యాత్ర కష్టాలు తీరనున్నాయి. పట్టణ పరిధిలో మరణించిన వారి దహన సంస్కారాల నిమిత్తం మహాప్రస్థానం పేరుతో కొత్త వాహనాన్ని పురపాలక సంఘం అధికారులు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇప్పటివరకు పట్టణంలో దహన సంస్కారాల కోసం ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని మృతదేహాల దహన సంస్కారాలకు శ్మశానవాటిక వరకు మోసుకెళ్లేందుకు మనుషులు దొరకని పరిస్థితి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రజల అవసరాల దృష్ట్యా మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి పాలక వర్గ సభ్యులు పట్టణానికి చెందిన కొందరి ఆర్థిక సహాయంతో కొత్తగా డిజైన్ చేయబడిన అంతిమయాత్ర వాహనాన్ని శనివారం నుంచి అందుబాటులోకి తెచ్చినట్టు ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ కె.వీరయ్య తెలిపారు. వాహనంలో అంతిమయాత్ర అవసరాలకు సరిపోయేలా ఏర్పాట్లు చేశారు. ఈ వాహనం అవసరమైన వాళ్లు రూ.1000 రుసుము చెల్లించి వినియోగించవచ్చు అని ఆయన తెలిపారు. వాహనం అవసరమైనవాళ్లు పురపాలక సంఘం శానిటరి ఇన్‌స్పెక్టర్ ఫోన్ నెంబరు.9618496437 సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు.



కొత్తగా వినియోగంలోకి తెచ్చిన అంతిమ యాత్ర రథం

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల సాయం



విరాళం స్వీకరిస్తున్న కమిటీ సభ్యులు

రాంబిల్లి: మామిడివాడ పైడితల్లమ్మ ఆలయ నిర్మాణానికి పులపర్తికి చెందిన గొంతిన నాగేశ్వరరావు రూ.50 వేలు విరాళం అందజేశారు. శనివారం ఈ విరాళాన్ని కమిటీ సభ్యులు స్వీకరించారు. దాతల విరాళాలతో మామిడివాడలో పైడితల్లమ్మ అమ్మవారి ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ మేరకు కమిటీ సభ్యులు విరాళాల సేకరణ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నెట్టెం సత్యనారాయణ, కన్నం రమణారావు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సొంతిల్లు ఉండాలి

కోటవురట్ల : సుంకపూరులోని వైఎస్సార్ జగనన్న కాలనీలో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. ప్రత్యేకాధికారి ఉదయశ్రీ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చారు. ఆమె మాట్లాడుతూ పేదలకు సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఇంటి స్థలాన్ని ఇవ్వడంతో పాటు ఇల్లు కట్టుకునేందుకు కూడా ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. బిల్లులు సకాలంలో మంజూరవుతున్నాయని, మెటీరియల్ కూడా అందుబాటులో ఉందన్నారు. అనంతరం ఆర్బీకే, నిర్మాణంలో ఉన్న వెల్‌నెస్ సెంటర్లను పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇళ్ల నిర్మాణాలపై సిబ్బందితో సమీక్ష చేశారు. ఏవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



సుంకపూరులోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ఉదయశ్రీ

పక్కాగా ఫ్యామిలీ డాక్టర్ సేవలు

డీఎంహెచ్‌వో హేమంత్

నక్కపల్లి : మండలంలో ఫ్యామిలి డాక్టర్ వైద్య సేవలు పక్కాగా అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హేమంత్ అన్నారు. శనివారం ఆయన గొడిచర్ల పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, ఓపి వైద్యసేవలను, ఫార్మసీ విభాగాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలను గురించి వైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. గునిపూడిలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ అనే విధానాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిందని గ్రామంలోకి డాక్టర్లు వచ్చి వైద్య సేవలు అందించడం, పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వయోభారంతో బాధపడేవారు, మంచాలకే పరిమితమైన వారికి ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వైద్య బృందంతో పాటు, అన్నిరకాల పరీక్షలు చేసేందుకు అంబులెన్స్‌లు సైతం అందుబాటులో ఉంటున్నాయన్నారు. ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడుతూ ప్రజా వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రోగులకు అందుబాటులో ఉంటూ సరైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆస్పత్రిలో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. డ్యూటీల ప్రకారం సిబ్బంది ఆస్పత్రిలో ఉండాలన్నారు. రోగుల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు.



గునిపూడిలో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్

ఇంటింట సర్వే సత్వరం పూర్తి చేయాలి



గొడిచర్లలో సర్వే పరిశీలిస్తున్న తహసీల్దార్

నక్కపల్లి: మండలంలో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ అంబేద్కర్ ఆదేశించారు. శనివారం ఆయన గొడిచర్ల, ఉద్దండపురం గ్రామాల్లో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం బీఎల్‌వోలంతా గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఇంటింటికీ తిరిగి ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలన్నారు. కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలన్నారు. ఎటువంటి వివాదాలకు తావు లేకుండా ఈ సర్వే పూర్తి చేయాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

మునగపాక : జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని డీఎల్‌డీవో మంజులావాణి కోరారు. మునగపాక, ఒంపోలు, టి.సిరసపల్లి తదితర ప్రాంతాల్లోని జగనన్న ఇళ్ల కాలనీలను ఆమె హౌసింగ్ డేలో భాగంగా సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలతో పాటు స్థలాలు కేటాయిస్తామన్నారు. మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, మండల ఇంజినీరింగ్ అధికారి చంద్రశేఖర్, సచివాలయ ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



మునగపాకలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఎల్‌డీవో మంజులావాణి

సీడీసీ మాజీ చైర్మన్ కుటుంబానికి దాడి పరామర్శ

మునగపాక : సీడీసీ మాజీ చైర్మన్ దివంగత ఆడారి సూరిబాబు కుటుంబాన్ని శనివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు పరామర్శించారు. అనకాపల్లి చెరకు అభివృద్ధి మండలి (సీడీసీ) చైర్మన్‌గా పనిచేసిన సూరిబాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు సూరిబాబు కుటుంబాన్ని వీరభద్రరావు పరామర్శించి సంతాపం తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు పాల్గొన్నారు.



సూరిబాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరభద్రరావు

మెయిన్‌రోడ్డు పనులు ప్రారంభం

పాయకరావుపేట : పట్టణంలో గల మెయిన్‌రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. గౌతమ్ థియేటర్ సెంటర్ నుండి బైపాస్ సెంటర్ వరకు 1.9 కిలోమీటర్లు పొడవునా రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. వీఎంఆర్‌డీఏ నిధులతో కోటి 95 లక్షలు రూపాయలతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. రోడ్డు విస్తరణకు చిన్న వర్తకుల సంఘం కోర్టును ఆశ్రయించడం వల్ల విస్తరణ లేకుండా, యథాప్రకారం రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని వీఎంఆర్‌డీఏ అధికారులు తెలియజేశారు.



పాయకరావుపేట మెయిన్‌రోడ్డు పనులు చేపడుతున్న దృశ్యం

ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కశింకోట: విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్ ద్వారా చెల్లించడానికి వినియోగదారులు ఈస్టర్న్ పవర్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ స్థానిక ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) ఎస్. రామకృష్ణ కోరారు. శనివారం రాత్రి ఆయన విలేరులతో మాట్లాడుతూ www.apeasternpower.com వెబ్‌సైట్ ద్వారా పేబిల్ ఆప్షన్ ఎంపిక చేసుకుని ఆన్‌లైన్‌లో కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చన్నారు. విద్యుత్ కనెక్షన్‌కు అనుసంధానం చేయడానికి తమ ఆధార్ నంబర్ నకలును తమ విద్యుత్ సిబ్బందికి అందజేయాలని కోరారు. సందేహాలుంటే 1912 నంబర్‌కు కాల్ చేసి నివృత్తి చేసుకోవాలని కోరారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులు, ఎంఈవో 1లను సత్కరిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : ఉద్యోగులందరికీ బదిలీలు సర్వసాధారణమని ఏపీటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు, గుర్రాజుపేట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కర్రి ధర్మారావు అన్నారు. గుర్రాజుపేట పాఠశాలలో శనివారం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు, ఎంఈవో 1గా ప్రమోషన్ పొందిన పి. అప్పారావు తదితరులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రత్నం, స్థానికులు సాగి సత్యనారాయణరాజు, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.